రాజకీయ ప్రముఖులకు ఆహ్వానం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

కొమురవెల్లి, ఏప్రిల్ 23: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే ఎల్లమ్మ-జమదగ్ని మహర్షి కల్యాణానికి రావాలని కోరుతూ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్‌తో పాటు పలువురి రాజకీయ ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. గౌడసంఘం నాయకులు బుడిగె గురువయ్యగౌడ్, బుడిగె ఐలేనిగౌడ్, రమేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్(చక్రి) ఉన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

వెంకట్రామిరెడ్డిని కలిసిన కొట్టాల యాదగిరి, ముదిరాజ్ సంఘం నేతలు

గజ్వేల్, ఏప్రిల్ 23: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేతుల్లోనే ముదిరాజుల భవిష్యత్ క్షేమంగా ఉంటుందని, అందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. మంగళవారం మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ముదిరాజ్ సంఘ బాధ్యులతో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి కేసీఆర్ చేసిన కృషికి ప్రతి గ్రామంలో ఏకగ్రీవ తీర్మానాలు చేద్దామని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మాయ మాటలు నమ్మిమోసపోవద్దన్నారు. ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఐదు ఎకరాల భూమితో పాటు రూ.5కోట్లు మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, పిట్ల సత్యనారాయణ, హరిబాబు, పడిగేరాజు, నరేశ్, జీర రాజు, రమేశ్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ సభ్యులు

ములుగు, ఏప్రిల్ 23 : నిరుపేదలకు రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అన్నారు. ములుగు మండల పరిధిలోని లక్ష్మక్కపల్లిలోని వీపీజే ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ములుగు, వర్గల్ మండలాలకు చెందిన విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ ఆధ్వర్యంలో 350 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు సేవాభావంతో పనిచేసినపుడే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ శంకర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహారెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్‌గౌడ్, రోటరీ సభ్యులు ఉదయ్ పిల్లాని, రాజ బొమ్మిడాల, రమేశ్, శరత్, రామ్‌ప్రసాద్, హరిశంకర్, చంటి, కరుణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్కూక్‌లో...

మర్కూక్, ఏప్రిల్ 23: రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో పాములపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ సభ్యుడు బేతి నరేందర్‌రెడ్డి 20 సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లతీఫ్‌సైదా ఉపాధ్యాయుడు నరోత్తమ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం



రైతు సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న గడీల భైరవరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 23: అకాల వర్షాలు, కరువుతో అతలాకుతలం అవుతుంటే రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో మంగళవారం రైతు సంఘాల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల కారణంగా యాసంగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని..దానికి తోడు భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో నిళ్లు లేక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ నేతలు రామచంద్రరావు, రంగారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి,కనకయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలంగాణ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ పరీక్షలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23: జిల్లా వ్యాప్తంగా రేపటి నుంచి తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో తెలంగాణ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ మేరకు రేపటి నుంచి మే 2వ తేదీ వరకు జరిగే ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి సిద్దిపేట పట్టణంలోని పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గజ్వేల్, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల బాలురు చేర్యాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హుస్నాబాద్ పరీక్షా కేంద్రాలు ఉండగా.. ఇంటర్మీడియెట్ పరీక్షలకు సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల సిద్దిపేట, ప్రభుత్వ ఉన్నత పాఠశాల గజ్వేల్, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల చేర్యాల, జడ్పీ ఉన్నత పాఠశాల హుస్నాబాద్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు.

మల్లన్న వార్షిక ఆదాయం రూ.46.34 కోట్లు

చేర్యాల, ఏప్రిల్ 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి వార్షిక ఆదాయ, వ్యయాలను ఆలయ ఈవో బాలాజీ శర్మ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. 2023-24 సంవత్సర నికర ఆదాయం రూ. 18,74,65,47 వచ్చిందన్నారు. వార్షిక ఆదాయం రూ. 46.34కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నట్లు తెలిపారు. సంవత్సరం కాలంగా టికెట్ల విక్రయం, ఆర్జిత సేవల ద్వారా రూ. 8,77,35,445, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 5,61,00,690, హుండీ లెక్కింపుల ద్వారా రూ. 7,53,57,522, పెట్టుబడుల ద్వారా రూ. 13,15,59,896, వడ్డీల రూపంలో రూ. 1,31,79,329, లీజు, లైసెన్స్‌ల ద్వారా రూ. 2,63,86,640, అన్నదానం ద్వారా రూ.25,46,514, ఇతర ఆదాయం ద్వారా రూ. 88,61,455, అడ్జెస్ట్‌మెంట్స్ ద్వారా రూ.74,41,922 తదితర ద్వారా రూ. 41,18,30,650 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రారంభ నిల్వ ప్రకారం రూ. 1,23,040, బ్యాంకు డిపాజిట్లు రూ. 5,14,79,509 ఉన్నట్లు తెలిపారు. వ్యయాల కింద రిట్యూయల్స్, ఉభయం, ఉత్సవాల నిర్వాహణకు రూ. 73,51,799, ప్రసాదం తయారీకి రూ. 4,13,81,651, ఎస్టాబ్లిష్‌మెంట్స్ చార్జీలు రూ. 5,61,08,375, స్టాట్యుటరీ చెల్లింపులు రూ. 2,58,09,303, అడ్జస్ట్‌మెంట్స్ రూ. 13,86,85,328, ఇతరాత్ర రూ. 72,69,914, పెట్టుబడులు రూ. 51,48,428, అన్నదానం రూ. 36,39,676,జాతర నిర్వహణ ఖర్చు రూ. 74,46,711, నిర్మాణాలు రూ. 6,84,20,391, వేతనాలు రూ. 3,80,00,200, శానిటేషన్‌కు రూ. 83,45,754 మేర వ్యయం చేసినట్లు తెలిపారు. ముగింపు విలువగా నగదు రూ. 55,60,488, బ్యాంకు డిపాజిట్లు రూ.5,03,15,187ఉన్నట్లు తెలిపారు. మల్లన్న ఆదాయం మొత్తంగా రూ. 46.34కోట్లు టర్నోవర్‌కు చేరుకున్నట్లు వెల్లడించారు. అడ్జస్ట్‌మెంట్స్ రూ. 13,86 కోట్లు, పెట్టుబడులు రూ. 13,15 కోట్లుగా వెల్లడించారు. ఆలయ ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లమ్మతల్లి ఆశీస్సులు ఉండాలి

చిన్నకోడూరు: ఎల్లమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నంగునూరు: అంక్షాపూర్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 23: చిన్నకోడూరులోని ఎల్లమ్మ దేవాలయ అష్టమ వార్షికోత్సవానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్లమ్మతల్లి ఆశీస్సులతో మనం చేసే కార్యం సఫలం కావాలన్నారు. గ్రామస్తులకు అన్నింటా శుభం చేకూరాలని కోరుకున్నారు.. గౌడకుల సంఘం ప్రతినిధులు హరీశ్‌రావుని సన్మానించారు. ఎమ్మెల్యే వెంట మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆలయాలను సందర్శించిన హరీశ్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 23: మండలంలోని పలు ఆలయాలను మాజీ మంత్రి హరీశ్‌రావు సందర్శించారు. జేపీతండాలో దుర్గావీరాంజనేయస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన, రాంపూర్‌లోని సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, గట్ల మల్యాల గ్రామంలో ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ఠ, అంక్షాపూర్ రేణుకా ఎల్లమ్మ దేవాలయ నాలుగో వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

జక్కాపూర్‌లో...

నారాయణరావుపేట, ఏప్రిల్ 23: మండల పరిధిలోని జక్కాపూర్‌లో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు, నారాయణరావుపేటలో బీరప్ప ఉత్సవాల్లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

అక్కన్నపేట, ఏప్రిల్ 23: ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని మసిరెడ్డితండాలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్ హరీశ్‌రావుకు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లిని దర్శించుకున్న హరీశ్‌రావు

వర్గల్, ఏప్రిల్ 23: మండలంలోని మజీద్‌పల్లిలో జరుగుతున్న రేణుకాఎల్లమ్మతల్లి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన ఎల్లమ్మదేవి కల్యాణం, గౌరంగం తదతర పూజల్లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు.ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ, ఎంపీపీ, మాజీ సర్పంచ్, గౌడసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇటిక్యాల పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 23: వేసవి సెలవుల్లో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ, ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్, మండల నోడల్ అధికారి మాధవరెడ్డి, కాంపెక్స్ హెడ్‌మాస్టర్ సైదులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ దయానంద్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

హోమం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీభవాని సహిత కాశీమ రకత లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న మాట్లాడుతూ ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు వివరించారు. అనంతరం స్థానిక పాటిమీద హనుమాన్ ఆలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు వల్లపు రాజు, చిత్తారి పద్మ, కోఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, మర్యాల రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు

రాయపోల్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

రాయపోల్, ఏప్రిల్ 23 :మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ వాసులు ఎల్లమ్మ పండుగను మూడు రోజుల నుంచి ఘనంగా జరుపుకొంటున్నారు. సోమవారం రాత్రి బోనాలను ఊరేగింపుగా పోచమ్మ దేవత వద్దకు తీసుకువచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఉదయం బోనాల ఊరేగింపు, పుట్టమన్ను తేవడం, గంగం తెప్ప విడవడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.



గుట్టచుట్టూ ఊరేగిస్తున్న బండ్లు, వాహనాలు

ఘనంగా శకటోత్సవం

బెజ్జంకి, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి జాతరలో భాగంగా మంగళవారం శకటోత్సవాన్ని నిర్వహించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, డీసీఎం వ్యాన్లు, ఇతర వాహనాలను ఆలంకరించి డప్పుచప్పుళ్ల మధ్య గుట్ట చుట్టూ ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సీపీఎం నాయకుల ప్రచారం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్ల బండి శశిధర్ అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని సలాఖపూర్, మర్మాముల గ్రామాల్లో సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్, మండల కమిటీ సభ్యుడు ఎండీ షఫీ, నాయకులు బాల్‌రెడ్డి, దయ్యాల కనకయ్య, మల్లయ్య, శంకర్, రాజయ్య, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 23: మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎల్ల గురువారెడ్డి భవనంలో మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ గ్రాట్యుటీ బోనస్ పెన్షన్ చట్టాలను అమలు చేయాలన్నారు. హమాలీ, ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు మరణిస్తే రూ. పది లక్షలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఉపాధిహామీ కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్ల మల్లేశం, సహాయ కార్యదర్శి కర్ణాల చంద్రం, సంపత్, కోశాధికారి నర్సింహులు, ఐలయ్య, గంగి రాజు, శ్రీను, రాజు, శ్యామ్ పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలి

దుబ్బాకలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 23: దుబ్బాక మార్కెట్ యార్డును మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ధాన్యం కొనుగోలు వివరాలతో పాటు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల కారణంగా టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం హరీశ్, దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

మిరుదొడ్డి, ఏప్రిల్ 23: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని తహసీల్దార్ గోవర్ధన్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. మంగళవారం ధర్మారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బార్‌దాన్ కోసం ఉన్నతాధికారులకు చెబుతామన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

చేర్యాల, ఏప్రిల్ 23: చేర్యాల మండలంలోని నాగపురి శివారులోని కొండపోచమ్మ ఆలయ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు దాడి చేశారు. జక్కన్నగారి పల్లవి హోటల్‌లో 13 లీటర్ల బీరు బాటిల్స్, తాటిపాముల స్వప్న హోటల్‌లో 6.950 లీటర్ల బీర్లు, విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23: ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తులపై సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో ఓ వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి 7.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో మరో మహిళ తన ఇంటిలో బెల్ట్ షాప్ నిర్వహిస్తుండగా రైడ్ చేసి 3.6 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

బెక్కల్‌లో...

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: ధూళిమిట్ట మండలం బెక్కల్‌కు చెందిన బొంగోని రాకేశ్ అనే బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఏఎస్సై విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. రాకేశ్ ఇంట్లో సోదాలు చేయగా తొమ్మిది బీర్లు లభ్యమైనట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే బీఎస్పీ లక్ష్యం

గజ్వేల్, ఏప్రిల్ 23: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడమే బీఎస్పీ లక్ష్యమని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ఓంప్రకాశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మరోసారి బీజేపీ గెలిస్తే ఆర్ఎస్ఎస్, బీజేపీదాని అనుబంధ సంఘాలన్నీ కలిసి కార్పొరేట్ శక్తులకు దేశాన్ని ధారాదత్తం చేసే అవకాశం ఉందన్నారు. దేశంలో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బహుజనులపై ఉందన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వినోద్, నాయకులు నరేశ్, గుర్రం ఎల్లం, చంద్రం, ప్రసాద్‌మౌర్య తదితరులు పాల్గొన్నారు.

దేవులపల్లి రమేశ్‌కు సాహిత్య పురస్కారం

సాహిత్య పురస్కారం అందుకుంటున్న దేవులపల్లి రమేశ్

నంగునూరు, ఏప్రిల్ 23: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో సాహిత్య రంగంలో సేవలు అందించినందుకు నంగునూరుకు చెందిన దేవులపల్లి రమేశ్‌కు సాహిత్య పురస్కారం వరించింది. ఈ మేరకు పలువురు అతిథుల నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి కవులు, కళాకారులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల ఆకస్మిక తనిఖీ

హుస్నాబాద్, ఏప్రిల్ 23: డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని వెంకటరమణ డయాగ్నోస్టిక్ సెంటర్, ఆరోగ్య మల్లికార్జున డయాగ్నోస్టిక్ సెంటర్లలో వైద్యాధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా, సరైన అర్హత సర్టిఫికెట్లు లేకుండా డయాగ్నోస్టిక్ సెంటర్లను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వైద్యాధికారి డాక్టర్ నికిత, సీహెచ్‌వో శబ్దప్రకాశ్ పాల్గొన్నారు.

హోరెత్తిన జై హనుమాన్ నినాదాలు

- కన్నుల పండుగలా హనుమాన్ జయంతి
- ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు

హుస్నాబాద్: హనుమాన్ జయంతిలో పాల్గొన్న భక్తులు

హుస్నాబాద్, ఏప్రిల్ 23: హుస్నాబాద్ పట్టణంతో పాటు డివిజన్‌లోని అన్ని మండలాల్లోని హనుమాన్ దేవాలయాల్లో చిన్న హనుమాన్ జయంతిని మంగళవారం కన్నుల పండుగలా జరిగింది. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో దేవాలయాలు హోరెత్తాయి. ఉదయం నుంచే హనుమాన్ దేవాయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అన్నదాన కార్యక్రమాలతో ఆలయాలు సందడిగా మారాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.

మిరుదొడ్డి టౌన్‌లో..

మిరుదొడ్డి, ఏప్రిల్ 23: మిరుదొడ్డి టౌన్‌లో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని దేవాలయంలో ఆంజేయస్వామి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకులార్చన, బీశ్వర్చాన నిర్వహించారు. పురోహితులు విఠాల రాజపున్నయ్యశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పంచముఖ హన్‌మాన్ విగ్రహ ప్రతిష్ఠ

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 23 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైల్వే ట్రాక్ పక్కన రైల్వే అధికారుల ఆధ్వర్యంలో 27 అడుగుల పంచముఖ హన్‌మాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పంచముఖ హన్‌మాన్ విగ్రహానికి కుంబాభిషేకం చేయడంతో పాటు అన్నదానం చేశారు.

లోక కల్యాణార్థం చండీయాగం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 23: సిద్దిపేట ఉమాపార్థివ కోటిలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం లోక కల్యాణార్థం నవగ్రహ రుద్ర చండీయాగాన్ని అర్చకులు నిర్వహించారు.యాగంలో ఆలయ కార్యనిర్వహణాధికారి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో నగదు పట్టివేత

చేర్యాల, ఏప్రిల్ 23: పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద సీఐ శ్రీను, ఎస్సై దామోదర్ మంగళవారం ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎల్లుపల్లికి చెందిన పొద్దుటూరి వెంకటేశ్ అనే వ్యక్తి కారు నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.60,050 నగదును పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద రహదారులపై నిత్యం తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వద్ద రూ.50వేల కంటే ఎక్కువగా డబ్బులు ఉంటే వాటికి సంబంధించిన పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. పోలీసులు నిర్వహించే తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, శాంతియుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ఎన్నికలు నిర్వహించ